



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

30 కేంద్రాల్లో గ్రూప్ -2 పరీక్ష

– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 23న నిర్వహించే ఎపిపిఎస్సి గ్రూప్–2 పరీక్షను 30 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వెల్లడించారు. శుక్రవారం గ్రూప్ –2 మెయిన్స్ పరీక్షల నిర్వహణ పై లైజాన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 30 కేంద్రాలలో 9993 మంది అభ్యర్థులు గ్రూప్ 2 పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు నిర్వహించాలన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ షాపులను మూసి వేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, అడిషనల్ ఎస్పి అడ్మినిస్ట్రేటివ్ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పి కృష్ణమోహన్ ,డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు సిద్ధాంతం సజీవమైంది

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మార్క్సిజం ఎప్పటికి సజీవమైందని, కమ్యూనిస్టు సాహిత్యానికే ప్రపంచ వ్యాప్తంగా తిరిగి ప్రాచుర్యం పెరుగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ ఉద్ఘాటించారు. శుక్రవారం కర్నూలు నగరంలోని పాతబస్తీలోని హరికిషన్‌సింగ్ సూర్జిత్‌భవన్‌లో సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన రెడ్‌బుక్‌డే ఘనంగా నిర్వహించారు. విఐ లెనిన్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని రాజ్యంవిప్లవం అనే పుస్తకాన్ని ఈ సంవత్సరం ఎంచుకొని అధ్యయనం చేసి చర్చిస్తున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ కమ్యూనిజానికి కాలం చెల్లిందని దాదాపు గత మూడు దశాబ్దాలుగా పెట్టుబడిదారీ మేధావులు, మీడియా ఊదరగొట్టిందని అన్నారు. యువతరాన్ని (మిలీనియర్స్) అంటే 2000 సంవత్సరం నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఇప్పటికి వారి వయస్సు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండే తరం దాదాపు కమ్యూనిజానికి, కమ్యూనిస్టు ఉద్యమాలకు, దూరమైందని ,కెరీర్ పై వారి దృష్టి కేంద్రీకరించారన్నారు. అందుకోసం ఉద్యమాలకు పోరాటాలకు దూరంగా ఉన్నారని, నేడు స్వీయ సమర్థతపై ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చన్నారు.సంఘాల ఉద్యమాలు అవసరం లేదని, ఇజాలకు కాలం చెల్లిందని టూరిజం ఒకటే మిగిలిందని ,వ్యంగాస్త్రాలు బడా పెట్టుబడిదారులు సంధించారని అన్నారు. బడా పెట్టుబడిదారులు చెప్పినట్టు ఈ పాత చింతకాయ



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

పచ్చడి సిద్ధాంతాన్ని చంద్రబాబు నాయుడు లాంటి వారు ఇంకా పట్టుకొని వేలాడుతున్నాన్నారు. ఈమధ్య ఢిల్లీ పర్యటనలో ఇదే బాణిలో మాట్లాడిన బాబు, మోడీ, ఆర్‌ఎస్‌ఎస్‌ల ఆశీర్వాదం కోసం తాపత్రపడ్డారని తెలిపారు. ప్రపంచమంతా మారుతోందని ,కమ్యూనిజానికి కాలం చెల్లిందన్న సిద్ధాంతానికి కాలం చెల్లిందని ఆయన గుర్తు చేశారు. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షేమ నుండి గట్టెక్కడానికి దేవుళ్లను, గుడులను ,భక్తిని, కూడా వ్యాపారంగా మార్చి వాడుకుంటున్నారని మరోసారి రుజువు అయిందని వివరించారు. మార్క్సిజం ఇప్పటికి సజీవమైందని, అందుకే మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్ , మావో, హోచ్చిమిన్ , గ్రాం స్కీ, డిమిట్రోవ్ తదితర విప్లవకారుల రచనలను, ఈ ఎంఎస్ నంబూద్రి పాద్, సుందరయ్య, భగత్ సింగ్, లాంటి యోధులు రాసిన పుస్తకాలను ఈ తరం అధ్యాయనం చేస్తే ,వర్తమాన సమస్యలను శాస్త్రీయంగా అర్థం చేసుకోవచ్చన్నారు. సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఎస్ఎ సుభాన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్, డి అబ్దుల్ దేశాయ్, కె.రామకృష్ణ, నగర కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శులు, యూనియన్ల నాయకులు, సభ్యులు హాజరయ్యారు.

కర్నూలుక్రైమ్: కార్మికుల హక్కులను కాలరాసే ప్రభుత్వాలకు, పాలకులకు బుద్ధి చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి. నారాయణ కోరారు. శుక్రవారం కర్నూలు మండలం, అంబేద్కర్ నగర్‌లో రెడ్ బుక్ డే కార్యక్రమాన్ని సిపిఎం సీనియర్ నాయకులు భీసన్న అధ్యక్షతన నిర్వహించారు. కెవి. నారాయణ మాట్లాడారు. సిపిఎం మండల నాయకులు రాఘవేంద్ర, నరసింహ, పార్టీ నాయకులు శంకర్, మస్తాన్, మధు, రాజు, ఆదాము, మద్దిలేటి, కష్ణ, ప్రభుదాస్, కార్మికులు పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: కర్నూల్ నగరంలోని శరీన్ నగర్ హమాలీ యూనియన్ ఆఫీసులో హమాలి యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ రచించిన రాజ్యం విప్లవం పుస్తకం పై రెడ్ బుక్ డే నిర్వహించారు. యూనియన్ కార్యదర్శి ఈశ్వర్ అధ్యక్షత వహించారు.సిఐటియు నగర అధ్యక్షులు ఆర్. నరసింహులు, నగర కార్యదర్శి సిహెచ్ సాయిబాబా మాట్లాడారు.

టమోటాను ప్రభుత్వమే కొంటుంది

- జాయింట్ కలెక్టర్ బి.నవ్య

ప్రజాశక్తి-పత్తికొండ

టమోటా ధరలు పతనమైనప్పుడు టమోటాలు ప్రభుత్వమే కొనుగోలు చేసి, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. శుక్రవారం పత్తికొండ టమోటా మార్కెట్ ను జాయింట్ కలెక్టర్ నవ్య, ట్రైనీ కలెక్టర్ కళ్యాణి సందర్శించారు. రైతులను టమోటా ధరలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ధర రూ.10 నుంచి రూ.12 ఉందని, ప్రస్తుతం మార్కెట్‌లో కొనుగోళ్లు నిర్వహించడం లేదు. అయితే ధర పూర్తిగా పతనమైనప్పుడు రైతు నష్టపోకుండా ప్రభుత్వమే రూ.8 కిలో చొప్పున కొనుగోలు చేస్తుందని అన్నారు. పత్తికొండ మార్కెట్‌లో ధర పథనమైందని అందిన ఫిర్యాదు వచ్చినందున ఆమె మార్కెట్‌ను సందర్శించారు. మార్కెట్ అధికారులు టమోటాను కొనుగోలు చేసి రైతు బజార్‌కు సరఫరా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ జిల్లా వ్యవసాయ అధికారి రామాంజనేయులు, జిల్లా మార్కెట్ వ్యవసాయ అధికారి నారాయణమూర్తి, పత్తికొండ మార్కెట్ సెక్రెటరీ కార్నలిస్, హార్టికల్చర్ అధికారి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జెసి డాక్టర్ నవ్య

క్లస్టర్ భవనాలను యథావిధిగా ఉంచాలి


- ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ యూనివర్సిటీకి సంబంధించిన భవనాలను ఉర్దూ వర్సిటీకి ఇవ్వకుండా యధావిధిగా ఉంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధు మూర్తికి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ఫర్ మెన్ డిగ్రీ కళాశాలలో రూసా నిధులతో నిర్మించిన భవనాలను అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి తాత్కాలికంగా అప్పగించాలని ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలన్నారు. కర్నూలు నగరంలోనీ సోముసెట్టు నగర్ లో ఒకే భవనంలో ఆయుష్మన్, మదర్ థెరీసా నర్సింగ్ కళాశాలలను నిర్వహిస్తున్నారన్నారు. మహిళా హాస్టల్‌ను నడుపుతూ ఫీజుల పేరుతో విద్యార్థులను వేదిస్తునందుకు ఆ కళాశాల గుర్తింపు రద్దు చేయాలన్నారు. కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రభుత్వ నిబంధనలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ల్యాబ్ లు, లైబ్రరీలు, అధ్యాపకులు లేకపోయినా లక్షల రూపాయలు విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు.

క్లస్టర్ వర్సిటీరిజిస్ట్రార్‌కు వినతి

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్లస్టర్ వర్సిటీకి రిజిస్ట్రార్ కట్ట వెంకటేశ్వర్లను వినతిపత్రం చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్, మాట్లాడుతూ క్లస్టర్ వర్సిటీ చెందిన ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల కు సంబంధించిన భవనాలను ఉర్దూ యూనివర్సిటీకి ఇవ్వాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులు జారీచేసిన ఉత్తర్వులు వెంటనే ఉప సంహరించుకోవాలన్నారు . నగర ఉపాధ్యక్షులు ఆర్యన్, నగర సహాయ కార్యదర్శి పద్వి నగర నాయకులు ఖాజావలి, హరి, మురళి, రవి, శేఖర్, మహేష్ , మనోహర్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సైబర్ క్రైమ్‌పై ముమ్మర అవగాహన

- కర్నూలు ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నూతనంగా శ్రీకారం చుట్టిన ' నేను సైబర్ స్మార్ట్ ' కార్యక్రమం పై వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలలో పోలీసు అధికారులు ప్రజలకు, విద్యార్ధులకు అవగాహన కల్పిస్తున్నారని కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ శుక్రవారం తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకూడదని కరపత్రాలు, లఘు చిత్రాలతో వివిధ కళాశాలలు, పాఠశాలలు , పట్టణాలు, గ్రామాలలో ప్రజలకు, విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నామన్నారు. డిజిటల్ అరెస్టు, జాబ్ ఫ్రాడ్స్, కెవైసిఫ్రాడ్స్, ఇన్వెస్ట్ మెంట్స్ ఫ్రాడ్స్, బ్యాంకు ఖాతాల ఓటిపిలు తెలియని వ్యక్తులకు షేర్ చేయవద్దని , తెలియని లింకులపై క్లిక్ చేయరాదని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 38 పోలీసు స్టేషన్ పరిధిలో 118 నేను సైబర్ స్మార్ట్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమాలలో 7,810 మంది ప్రజలకు, విద్యార్థులకు సైబర్ నేరాల బారిన పడకూడదని అవగాహన కల్పించారని తెలిపారు.

ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలి

- ఎపిజిబి ప్రధాన కార్యాలయం కడపలోనే ఉండాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపిజిబి కార్యాలయాన్ని కడపలోనే కోనసాగించాని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో గల ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కార్యాలయం ముందు సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకును కడపలోనే కొనసాగించాలి అమరావతికి తరలించకూడదని కోరుతూ బ్యాంకు ముందు ధర్నాచేశారు. తెలిపారు. సిఐటియు నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి.రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు నగర కార్యదర్శి సిహెచ్ సాయిబాబా మాట్లాడారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో మరో మూడు బ్యాంకులు విలీనమైన తర్వాత ఏర్పడిన బ్యాంకు ప్రదాన కార్యాలయం కడప లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. గతంలో అనంతగ్రామీణ బ్యాంకు, పినాకిని గ్రామీణ బ్యాంకు, రాయలసీమ గ్రామీణ బ్యాంకులు 2006 లో విలీనం అయి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుగా ఏర్పడిందన్నారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణబ్యాంకు ప్రదానకార్యాలయం కడప లోనే వుండాలని గతంలో నిర్ణయించారన్నారు. ఏమార్గదర్శకాల ప్రాతిపదికన చూసినా ప్రభుత్వం ఆర్థిక శాఖ డిపార్టుమెంట్ ఆఫ్ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఆర్ఆర్‌బి సెక్షన్ విడుదల చేసిన మార్గదర్శాల ప్రకారం ఆంధ్ర ప్రగతి గ్రామీణబ్యాంకు ప్రదానకార్యాలయం కడపలోనే కొనసాగించాలని గుర్తు చేశారు. లక్షలాది డిపాజిట్లు కోట్ల టర్నోవర్ కలిగిన బ్యాంకు కాబట్టి ప్రభుత్వం ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలన్నారు. అమరావతికి తరలించాలన్న ప్రభుత్వనిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిఐటియు నగర నాయకులు ఎస్. పెద్దమాలిక్, ఎస్. చిన్నమాలిక్, సతీష్, నాగరాజు, కాసిం, శ్రీను, చాంద్ బాషా తదితర కార్మికులు పాల్గొన్నారు.

కర్నూలు కార్పొరేషన్: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో మరో మూడు బ్యాంకులు విలీనమైన తర్వాత ఏర్పడిన బ్యాంకు ప్రధాన కార్యాలయం కడప లోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కర్నూలు కొత్త అయ్యప్ప స్వామి టెంపుల్ ముందున్న ఎపిజిబి బ్రాంచ్ వద్ద సిఐటియు ఓల్డ్ సిటీ నగర కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు మహమూద్ అధ్యక్షతన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ రామాంజనేయులు, సిఐటియు నగర కమిటీ సభ్యులు కుమార్ మాట్లాడారు. సిఐటియు నగర్ నాయకులు దూదకొండ కుమార్ తదితరులు మాట్లాడారు. సిఐటియు నాయకులు కృష్ణ, సోలామన్ రాజు, మాసమ్, శాంసన్, శేఖర్, అంజి, లింగం, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు



పత్తికొండలో బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీ

బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి- పత్తికొండ

బాల్య వివాహాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు పత్తికొండ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ అన్నారు. శుక్రవారం పత్తికొండ పట్టణంలోని కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాష ఆదేశాల మేరకు ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ ఆధ్వర్యంలో 'బాల్య వివాహాలకు వ్యతిరేకంగా' విద్యార్థులతో కలిసి బాలికలు 'వద్దు , బాల్య వివాహం వద్దు' చిన్నప్పుడే వివాహం వారి జీవితానికి విషాదం", అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. భ్రమరాంబ మాట్లాడుతూ ఆడపిల్లలకు చిన్నతనంలో వివాహం చేయడం వలన వారి బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని అన్నారు. బాలికలకు 18 సంవత్సరాల నిండిన తర్వాత వివాహం చేయడం వారి ఆరోగ్యానికి వారి బంగారు భవిష్యత్తుకు మంచిదని ఆమె తెలిపారు. ఉపాధ్యాయినీలు నాగలక్ష్మి, శ్యామల, రంగమ్మ, సుజాత, రుక్మిణమ్మ , చాముండేశ్వరి, ఉపాధ్యాయులు బాలరాజు, రాజశేఖర్ విద్యార్థినిలు పాల్గొన్నారు.



కాల్వబుగ్గలో శివరాత్రి ఏర్పాట్లను సమీక్షిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ గురు ప్రసాద్

కాల్వబుగ్గలో శివరాత్రి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కాల్వబుగ్గ రామేశ్వర స్వామి దేవాలయంలో 25 నుండి ప్రారంభం కానున్న మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గురు ప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం కాల్వబుగ్గ దేవాలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. దేవాలయ పరిసర ప్రాంతంలోని పెద్ద కోనేరు, చిన్నకోనేరులతో పాటు క్యూ లైన్లను పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి వసతితో పాటు పారిశుధ్య సౌకర్యాలను కల్పించాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట ఆలయ ఇఒ టి.మద్దిలేటి, ఉత్సవ కమిటీ సభ్యులు కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతి సంస్కృతిని తెలిపేది మాతృభాష

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అంతర్జాతీయ మాతభాషా దినోత్సవాన్ని క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివిఎస్. కుమార్ అధ్యక్షత వహించినారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ డివి ఆర్ సాయి గోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భాష అనేది మాటలు, శబ్దాలు, పదాలే కాదని ఒక జాతి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సాహిత్యాలన్నారు. భాషను రక్షించుకుంటే మన జాతి అస్తిత్వాన్ని కాపాడుకున్నట్లని తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ కట్ట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భాష అనేది అందరి భావ ప్రకటనను తెలియజేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. ప్రధాన వక్తగా వచ్చిన ప్రముఖ కవి రచయిత జంధ్యాల రఘు బాబు మాట్లాడుతూ భాష అనేది మృత భాషగా మారకుండా ఉండేందుకు భాషను అందరూ నిత్య వ్యవహారంలో ఉపయోగిస్తున్నప్పుడే అది జీవభాషగా ఉంటుందన్నారు. మనం తెలుగువాళ్లుగా మన మాతృభాష అయిన తెలుగును పరిరక్షించుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బిఆర్ ప్రసాద్ రెడ్డి, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ డి. మల్లయ్య, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఫామిదా బేగం, డాక్టర్ అక్తర్ భాను, డాక్టర్ శానావాజ్ బేగం, డాక్టర్ నాగరాజ శెట్టి, డాక్టర్ ఎం.పార్వతి , డాక్టర్ నెక్కంటి నాగ సురేష్, మిగతా అధ్యాపక బృందం , విద్యార్థులు పాల్గొన్నారు.



మాతృభాష దినోత్సవంలో విసి డివిఆర్ సాయిగోపాల్, రఘుబాబు, అక్తర్ భాను

ఘనంగా అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం

కర్నూలు : కర్నూలు శంకరాస్ డిగ్రీ కళాశాలలో ఘనంగాఅంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా నందికొట్కూరు గవర్నమెంట్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్. ఎం. అన్వర్ హుస్సేన్ మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని, తెలుగు భాషలో ఉండే తీయదనాన్ని, ప్రపంచంలోని భాషలన్నింటిలో తెలుగు స్థానాన్ని తెలిపారు. అంతర్జాతీయ మాతభాషా దినోత్సవ ప్రపాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మద్దిలేటి, కళాశాల తెలుగు అధ్యాపకులు మద్దయ్య, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అన్వర్ హుస్సేన్

మాతృభాష పరిరక్షణ అవసరం

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంలో డాక్టర్ శంకరశర్మ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

దేశ భాషల్లో ఏ భాషకు లేని గొప్పతనం తెలుగు భాషకు ఉందని, మాతృభాష పరిరక్షణ అవసరమని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవం సందర్భంగా ఘంటసాల గానసమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ తెలుగుభాష గొప్పతనాన్ని తెలియజేశారు. ఘంటసాల గాన కళా సంస్కృతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలుగు భాషను విన్నా.. మాట్లాడినా శరీరం పులకరించి పోతుందని అన్నారు. చిన్న వయసులోనే నేర్చుకున్న తెలుగు భాష విలువ ఎంతో గొప్పదని, అందులో జ్ఞాపకశక్తి, నేర్చుకునే శక్తి ఎంతో ఇమిడి ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరు మాతృభాషను విస్మరించరాదన్నారు. 1952లో ఈస్ట్ పాకిస్థాన్‌లో నలుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని వివరించారు. ఈ నేపథ్యాన్ని వివరిస్తూ అప్పట్లో బెంగాల్‌ను మాతృభాష చేయాలని కోరడంతో ఉర్దూను మాతృభాషగా చేసే ప్రయత్నం చేశారని, దానిని అడ్డుకునే క్రమంలో నలుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా తెలుగు వారందరిని ఒకచోట చేర్చి ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు 56 రోజులపాటు ఆవరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేశారన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో తెలుగులో మాట్లాడటం చాలామందికి కష్టంగా మారుతుందని, కానీ తెలుగు భాష ప్రాధాన్యతను ఎవరు విస్మరించరాదని కోరారు. తెలుగు భాషలో కుటుంబ బంధాలు, నాగరికత, మన సంస్కృతి సాంప్రదాయాలు ఇమిడి ఉన్నాయని గుర్తు చేశారు. ప్రపంచంలోని అన్ని దేశాలలో తెలుగువారు ఆయా రంగాల్లో రాణించి తెలుగుజాతి గొప్పతనాన్ని చాటుతున్నారని వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో ఏ దేశంలో వెళ్ళినా, విమానాశ్రయాల్లో.... నలుగురు తెలుగువారు కలిసిన ప్రతిచోట తెలుగు మాట్లాడుతుంటే ఆ ఆనందం మాటల్లో వర్ణించలేనిదన్నారు. మాతృభాష పరిరక్షణ కోసం పాటుపడే ప్రతి ఒక్కరికి తన సహకారం అందిస్తానని సూచించారు. ఘంటసాల గాన కళా సమితి ప్రతినిధులు డాక్టర్ డబ్ల్యు. సీతారాం, చంద్రశేఖర్ కల్కురా, వాసుదేవరావు, ఎలమర్తి రమణయ్య, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ, డాక్టర్ డబ్ల్యు సీతారాం



న్యాయవాదుల నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న వై.జయరాజు

అడ్వకేట్ యాక్ట్ సవరణ బిల్లుపై నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ముసాయిదా అడ్వకేట్స్ యాక్ట్ సవరణ బిల్లు 2025 వ్యతిరేకిస్తూ కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టులను బహిష్కరించి శుక్రవారం నిరసన తెలిపారు.సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాది, కర్నూలు ఎపి హైకోర్టు అధ్యక్షుడు, నేషనల్ లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ , మాజీ అధ్యక్షుడు వై.జయరాజు మాట్లాడుతూ కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ ప్రభుత్వం ప్రతిపాదించిన కఠినమైన సవరణలను ఎత్తిచూపారు. ఇవి బార్, న్యాయ వృత్తి , వాటి ప్రాతినిధ్య చట్టబద్ధమైన సంస్థలు, అంటే బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర బార్ కౌన్సిల్‌ల స్వయంప్రతిపత్తి , స్వాతంత్ర్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నా యన్నారు. ఈ సవరణలతో న్యాయ వృత్తి ,వాటి ప్రాతినిధ్య సంస్థలు బలహీనపడి ప్రభుత్వం చేతుల్లో కీలుబొమ్మలుగా మారతాయన్నారు. ఇపిఐ, జాతీయ కమిషన్లు , కేంద్ర సంస్థల మాదిరిగా మొత్తం న్యాయవాదులు, న్యాయవ్యవస్థ, అన్ని ప్రజాస్వామ్య శక్తులు, రాజకీయ పార్టీలు , పౌర సమాజం ఈ నిరసనలలో పాల్గొనాలన్నారు. ప్రతిపాదిత సవరణలను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలన్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నిత్యజీవరాజు, కార్యదర్శి రవికాంత్ ప్రసాద్, న్యాయవాదులు ఎం.సుబ్బయ్య, నాగప్ప,ఆర్.నరసింహ, మహేష్, ఎ.ప్రభాకర్ రెడ్డి, నాగేంద్ర యాదవ్, చంద్రుడు రవిరాజు పాల్గొని మాట్లాడారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కోడుమూరు పట్టణంలో శాశ్వత తాగునీటి సమస్యకు పరిష్కారం చూపించాలని, రాబోతున్న వేసవిలో ప్రజలకు తాగునీటి కష్టాలు లేకుండా చూడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి. నారాయణ డిమాండ్ చేశారు. కోడుమూరు సుందరయ్య భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కెవి. నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నాయని, పాలకులు మారుతున్నారని కోడుమూరు పట్టణానికి మాత్రం తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించలేకపోతున్నారని విమర్శించారు. గాజులదిన్నె ప్రాజెక్టు కోడుమూరు తలపైనే ఉన్నా కోడుమూరు ప్రజలకు గుక్కెడు నీళ్లు గొంతులోకి రావడం లేదంటే పాలన ఎంత చిత్తశుద్ధిగా ఉందో అర్థం అవుతుందన్నారు. మండలంలో కొన్ని గ్రామాలకు కూడా తాగునీటి సమస్య ఉందని దీనిపైన జిల్లా వాటర్ వర్క్స్ అధికారులు, కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని కోరారు. మండలంలో చాలా గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక గ్రామీణ సన్నా చిన్నకారు రైతాంగం పేదలు వలసలు పోతున్నారన్నారు.మండల కార్యదర్శి కామర్తి రాజు, మండల కమిటీ సభ్యులు టి వీరన్న, మనోహర్, జిపి వీరన్న, కె లక్ష్మన్న, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెవి.నారాయణ



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ఉద్యోగ ప్రకటనలో
రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఏది..?
- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆలూరు

నియోజకవర్గంలోని కోగిలతోట విద్యుత్ సబ్ స్టేషన్‌లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేసేందుకు సిబ్బంది కావాలని శుక్రవారం శివ ఎలక్ట్రికల్స్ కర్నూలు వారు ఇచ్చిన ప్రకటనలో రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఏ పోస్టులు, ఎన్ని ఖాళీలు చూపించ లేదని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ ప్రశ్నించారు. శుక్రవారం ఆలూరు జ్యోతి బసు భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోగిలతోట సబ్ స్టేషన్‌లో గతేడాది 2024 ఫిబ్రవరిలో షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టుల భర్తీ కోసం అధికారులు శివ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్‌కు అప్పగించారని తెలిపారు. నోటిఫికేషన్ ప్రకటన చేయకుండా నకిలీ సర్టిఫికెట్ ఉన్న వారిని తీసుకొని 9 నెలల వేతనాలతో పాటు ఈపిఎఫ్, ఈఎస్ఐ చెల్లించారని చెప్పారు. ప్రజాశక్తిలో వచ్చిన కథనాలతో వారిని తొలగించినట్లు తెలిపి మళ్లీ 2025 ఫిబ్రవరిలో నకిలీ సర్టిఫికెట్ ఉన్న వారినే తీసుకున్నట్లు ప్రజాశక్తిలో కథనం వచ్చిందని తెలిపారు. మళ్లీ అదే కాంట్రాక్టర్‌కు అధికారులు షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులకు భర్తీ చేసేందుకు తూతూమంత్రంగా ఉద్యోగ ప్రకటన ఇచ్చారని చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి షిఫ్ట్ ఆపరేటర్ల నియామకాల్లో అధికారులకు, కాంట్రాక్టర్‌కు, పాలకులకు ముట్టిన ముడుపులపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన నిరుద్యోగుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కెపి.నారాయణ స్వామి, షాకీర్, కృష్ణ, ఈరన్న, నాగరాజు పాల్గొన్నారు.

టమోటా రైతులను ఆదుకుంటాం
- టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి - ఆస్పరి



టమోటా రైతులతో మాట్లాడుతున్న వీరభద్ర గౌడ్

టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బిల్లేకల్లు గ్రామంలోని కూరగాయల మార్కెట్‌లో టమోటా రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి డివిజన్‌కు ఒక టమోటా మార్కెట్ ఏర్పాటు చేసి కిలో రూ.8లకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. పత్తికొండ మార్కెట్లో వెయ్యి మెట్రిక్ టన్నుల టమోటాను కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. టమోటా రైతులు పత్తికొండ మార్కెట్‌కు వెళ్లి టమోటాను అమ్ముకోవాలని కోరారు. టిడిపి మండల కార్యదర్శి శేషాద్రి నాయుడు, కైరుప్పల సాగునీటి సంఘం అధ్యక్షులు బసవరాజు, సీనియర్ నాయకులు బాబు, శ్రీనివాస్ గౌడ్, సాలి సాహెబ్, మహేష్, వీరేష్, మధు, రంగనాథ్, సతీష్, యుగంధర్, హరి, వీరేష్, ఉచ్చీరప్ప పాల్గొన్నారు.

ఇసుక తరలింపుపై చర్యలు తీసుకోవాలి
- సిపిఎం మండల కార్యదర్శి జయరాజ్

ప్రజాశక్తి - మంత్రాలయం



మాట్లాడుతున్న జయరాజ్

మండలంలో తుంగభద్ర నదిలో నుంచి ఇసుక అక్రమ తరలింపుపై అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి హెచ్.జయరాజు కోరారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుంగభద్ర నది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం సరైనది కాదని హితవు పలికారు. రాజకీయ నాయకుల అండదండలతో ఇసుక అక్రమ జరుగుతోందని విమర్శించారు. నదిలో ఇసుకను ఇసుక బకాసురులు బొక్కేస్తుంటే నదిలో భూగర్భ జలాలు ఇంకిపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మండలంలో తాగడానికి నీళ్ల లేక ప్రతి గ్రామంలో రూ.10 నుంచి రూ.20 వరకు పెట్టి నీటిని కొనుక్కొని తాగుతున్నారని తెలిపారు. నదిలో భూగర్భ జలాలు ఇంకిపోతే ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికారులు ఆలోచించాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రీచ్‌ల దగ్గర నుంచి ఇసుకను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఇసుక బకాసురుల భరతం పడతామని హెచ్చరించారు. కెవిపిఎస్ నాయకులు చెట్నిహళ్లి దానియేలు, సిపిఎం కార్యకర్తలు రాజు, సురేష్, అనిల్ పాల్గొన్నారు.

కూటమితోనే తాగునీటి సమస్యకు పరిష్కారం
- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు చేపట్టారు. ముందుగా గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.2.5 కోట్లతో జలజీవన్ మిషన్ కింద చేపడుతున్న పైపులైను పనులకు భూమిపూజ చేసి పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గోనెగండ్లలో దశాబ్దాల క్రితం అప్పుడున్న 5వేల జనాభాకు అనుగుణంగా టిడిపి హయాంలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్ ట్యాంకు తప్ప తాగునీటి సమస్య పరిష్కారానికి ఎవరూ ఎలాంటి చర్యలూ చేపట్టలేదని తెలిపారు. ప్రస్తుతం గ్రామ జనాభా 20 వేలకు పైగా ఉండడం, దానికి తగ్గట్లు స్టోరేజీ లేకపోవడంతో తాగునీటి సమస్య తీవ్రమైందని చెప్పారు. సమస్య శాశ్వత పరిష్కారానికి కూటమి ప్రభుత్వం రూ.2.5 కోట్లతో మూడు ఓవర్ హెడ్ ట్యాంకులు, ఫిల్టర్ బెడ్లు, మైక్రో ఫిల్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికీ పైపులైన్ ద్వారా తాగునీరు అందించి సమస్యను పరిష్కరిస్తున్నామన్నా రు. తన తండ్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి కల.. వాటర్ గ్రిడ్ పథకాన్ని పూర్తి చేసి నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చూస్తామని తెలిపారు. అనంతరం చదువుల రామయ్య కాలనీ, లక్ష్మీపేటలో ఇంటింటికీ తిరిగి సమస్యలను తెలుసు కున్నారు. అక్కడి నుంచి బీసీ కాలనీ, దొనబండ వీధి, శ్రీరామ నగర్ కాలనీలో రూ.47 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లు, డ్రెయినేజీలను ప్రారంభించారు. బీసీ కాలనీ, చాకలి వీధుల్లో రూ.45 లక్షలతో కొత్తగా చేపట్టనున్న పనులకు భూమి పూజ చేశారు. అటు నుంచి కుమ్మరి రంగస్వామి పొలంలో ఉపాధి హామీ చట్టం రూ.2.30 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. అనంతరం గ్రామంలో టిడిపి కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. సర్పంచి హైమావతి, డిఇఇలు చంద్రశేఖర్, విద్యాసాగర్, తహశీల్దార్ కుమారస్వామి, ఎంపిడిఒ మణిమంజరి, ఎఇలు శివశంకర్, శ్రీనివాసులు రెడ్డి, ఎస్.షెక్షావలీ, ఎపిఒ మహ్మద్ బాష, ఎపిఎం హేమలత, ఎన్‌వి.రామాంజనేయులు, బేతాళ బడేసాబ్, నజీర్ సాహెబ్, తిరుపతయ్య నాయుడు, మాజీ సర్పంచులు రహమతుల్లా, రంగముని, రంగస్వామి నాయుడు, పూజారి చంద్ర, మదీనా సాహెబ్, రమేష్ నాయుడు, అడ్వకేట్ వెంకటేష్, నూర్ అహ్మద్, గౌవుండా రహమతుల్లా, కైరవాడి తిమ్మారెడ్డి, ఎర్రబాడు శ్రీను, మౌలా పాల్గొన్నారు.



నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు : సిఎం సహాయ నిధి.. పేదలకు పెన్నిధి అని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బీవీ నివాసంలో నియోజకవర్గంలోని సిఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్యం పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకతీతంగా.. కేవలం అర్హతే ఆధారంగా సిఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నట్లు తెలిపారు. మొత్తం రూ.18,32,561 విలువ గల చెక్కులను బాధితులకు అందజేశారు. టౌన్ బ్యాంకు ఛైర్మన్ ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి, వైస్ ఛైర్మన్ నరసప్ప, సోమల గూడూరు గ్రామ నాయకులు వెంకట్రామిరెడ్డి, చంద్రశేఖర్, పెద్దమరి వీడు గ్రామ నాయకులు మల్లయ్య, నరసింహులు, పట్టణ నాయకులు బందే నవాజ్, తురేగల్ నజీర్ అహ్మద్, రంగస్వామి గౌడ్ పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

బాధిత కుటుంబానికి చేయూత
ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బోయ ఉచ్చీరప్ప కుటుంబాని కి చేయూతనందించారు. ఉచ్చీరప్ప గుడిసె పూర్తిగా కాలిపోవడంతో టిడిపి నాయకులు ఆర్థిక సహాయం అందజే శారు. శుక్రవారం టిడిపి రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, టిడిపి మహిళా నాయకులు వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు ఉచ్చీరప్ప కుటుంబానికి క్వింటా బియ్యాన్ని టిడిపి మండల మాజీ కన్వీనర్ తలారి వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉచ్చీరప్ప కుటుంబం చాలా నిరుపేద కుటుంబమని, కూలికి వెళితే గాని కడుపు నిండని జీవితమని తెలిపారు. పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని, ఇంతలోనే విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధమైందని చెప్పారు. టిడిపి యువ నాయకులు తలారి కృష్ణయ్య, తలారి ప్రకాష్, బాలయ్య, రాజేంద్ర, గోవిందు, ఇబ్రహీం పాల్గొన్నారు.



చేయూతనందిస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం
ప్రజాశక్తి - దేవనకొండ

కొన్ని రోజుల క్రితం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బుడ్డ మాదన్నకు ఆర్థిక సహాయం అందజేశారు. జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషనర్ నారాయణ రెడ్డి రూ.20 వేల ఆర్థిక సహాయం శుక్రవారం మాజీ సర్పంచి రాజన్న, మాజీ ఉప సర్పంచి సత్య రాజు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మాజీ సర్పంచి రాజన్న రూ.10 వేల విలువ చేసే మేత ఇస్తానని హామీ ఇచ్చారు. గ్రామ పెద్దలు ఇమ్మానుయేల్, రాజు, బజారి, వాసు, పుల్లాపురం కిష్టన్న, వీరేష్, రాజు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న నారాయణరెడ్డి

సారా స్థావరాలపై దాడులు
ప్రజాశక్తి - ఆదోని



బెల్లం ఊటను ధ్వంసం చేసిన సిఐ

పట్టణ శివారు కొండల్లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. శుక్రవారం గువ్వమ్మ కొండ ప్రాంతాల్లో నాటుసారా స్థావరాల్లో నిల్వ ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సిఐ సైదుల్ మాట్లాడారు. 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. బట్టీలను పగలగొట్టామన్నారు. 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని సురేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. నవోదయంలో భాగంగా సారా రహిత ప్రాంతంగా ఆదోనిని మార్చాలని ఈ దాడులు నిర్వహించామని తెలిపారు. సారా అమ్మినా,తయారు చేసినా చట్టరీత్యా నేరమని చెప్పారు.

వలసలు వెళ్లొద్దు.. అందరికీ ఉపాధి కల్పిస్తాం : ఎపిఒ
ప్రజాశక్తి - మంత్రాలయం

వలసలు వెళ్లొద్దని, అందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఉపాధి హామీ చట్టం ఎపిఒ తిమ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని సూగూరు గ్రామంలో వలసలు వెళ్లకుండా గ్రామంలో కల్పించే ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలంటూ ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి చట్టం ద్వారా కల్పించే 100 రోజుల పని దినాలను అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఉపాధి అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేసుకుంటే స్వంత ఊళ్లోనే రోజుకు రూ.300 వేతనం వస్తుందని చెప్పారు. టిఎ రేణుక పాల్గొన్నారు.

ఎంపికను పారదర్శకంగా చేపట్టాలి
- వైసిపి బీసీ సెల్ అధ్యక్షులు మురళీ నాయుడు

ప్రజాశక్తి - గోనెగండ్ల

బీసీ కార్పొరేషన్ ద్వారా అందజేసే రుణాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని వైసిపి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు టి.మురళీ నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ రుణాల ద్వారా బీసీ వర్గాల్లోని నిరుపేద కుటుంబాలకు ఉపాధితో పాటు ఆర్థికంగా ఉపశమనం కలిగించే అవకాశం కల్పించాలని తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలకు అతీతంగా అర్హత ప్రమాణాలను ఆధారంగా చేసుకుని అధికారులు జాబితాను సిద్ధం చేయాలని కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు
ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో మండల ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు చర్మ సంబంధమైన వ్యాధులపై శుక్రవారం వైద్య పరీక్షలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది నిర్వహించారు. దురద ఉన్న విద్యార్థులను గుర్తించి దగ్గు, జలుబు, జ్వరం, విరోచనాలు తదితర వ్యాధులు కలిగిన విద్యార్థులకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత, భోజనానికి ముందు.. మలవిసర్జన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, తద్వారా వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. ఆరోగ్య విస్తరణాధికారి రంగస్వామి, సూపర్‌వైజర్ మద్దిలేటి, ఆరోగ్య కార్యకర్త శంషాద్ బేగం పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్ర రెడ్డి పుట్టినరోజు వేడుకలు
ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి పుట్టినరోజు వేడుకలను తెలుగు తమ్ముళ్లు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాఘవేంద్ర సర్కిల్‌లో బాణసంచా పేల్చి కేక్ కట్ చేసి సంబరాలతో ఒకరికొకరు తినిపించుకున్నారు. టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో నాయకులు అశోక్ రెడ్డి, ఎంపిటిసి ఎంబి.వెంకటేష్, విద్యాకమిటీ ఛైర్మన్ మడ్డి నరసింహ, నాయకులు డిసి.తిమ్మప్ప, శివ, రాఘన్న, డేవిడ్, రాజు పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో రాఘవేంద్ర రెడ్డి


మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి దర్శించుకున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా తన కుమారుడు, యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డితో కలిసి మంత్రాలయం వచ్చి గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళహారతులు స్వీకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు వారికి శేషవస్త్రం అందజేసి ఆశీర్వదించారు.

శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని చెట్నహళ్లి గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన టిడిపి నాయకులు చేపల నాగేష్, మేకల మల్లేష్, నాగరాజు ఇన్‌ఛార్జీ స్వగ్రామమైన మాధవరంలో ఆయన స్వగృహంలో ఆయనను కలిసి శాలువా, పూలమాలలు వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

అభిమానుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

టిడిపి నాయకులు, అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మండలంలోని మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహం వద్ద రాఘవేంద్ర రెడ్డి సోదరులు, టిడిపి నాయకులు ఎన్.రఘునాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు తెలుగు తమ్ముళ్ల రక్త దానం చేశారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

రక్తదానంలో.. మేము సైతం..!

కౌతాళం : టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి పుట్టినరోజు వేడుకలు సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 'మేము సైతం..' అంటూ కౌతాళం మండలం కుంటనహాల్ గ్రామానికి టిడిపి నాయకులు కదిలారు. శుక్రవారం మాధవరంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కుంటనహాల్ గ్రామానికి చెందిన చెంగిరి హుస్సేన్, ప్రసాద్, శివకుమార్, కౌతాళం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గిరి రక్తదానం చేశారు. టిడిపి నాయకులు కరి బసప్ప గౌడ్, బోయ మారెప్ప, నవీన్ గౌడ్, పీరా, దివాన్ వలీ తదితరులు రాఘవేంద్ర రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి పూలమాలలతో సన్మానించారు. రక్తదానం చేసిన వారికి రాఘవేంద్ర రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరూ ప్రాణదాతలని ఆయన అభివర్ణించారు. సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ కదిలి రావాలని కోరారు.



రక్తదానం చేస్తున్న టిడిపి కుంటనహాల్ నాయకులు

ఇంటర్ జీవితం మలుపునకు బాట : ఎంఇఒ
ప్రజాశక్తి - మంత్రాలయం

ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు సరైన నిర్ణయంతో జీవితాల్లో మలుపునకు బాటలు వేసుకోవాలని ఎంఇఒ రాఘన్న తెలిపారు. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాల వార్షికోత్సవం వేడుకలు కళాశాల ప్రిన్సిపల్ రమేషాచార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఇఒ హారయి మాట్లాడారు. బాగా చదివి ఉన్నత చదువులకు వెళితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. కళాశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు శ్రీనివాసులు, మల్లన్న, మద్దిలేటి, వీరన్న గౌడ్, వెంకటస్వామి, రామకృష్ణ, ప్రభాకర్, రమేష్, సునీత, మంజుల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరేష్ పాల్గొన్నారు.

సముదాయ నిర్మాణం పూర్తి చేయాలి
- జిల్లా జడ్జి కపర్తి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని కోర్టు సముదాయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి కపర్తి తెలిపారు. శుక్రవారం కోర్టు సముదాయాన్ని తనిఖీ చేశారు. ఆదోని అడ్వకేట్ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జనార్ధన్, జనరల్ సెక్రటరీ సురేంద్ర ఆయనను ఆహ్వానించారు. బిల్డింగ్ డెవలప్‌మెంట్ గురించి ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి చేయాలని ఇంజినీర్లకు ఆదేశించారు. సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి పిజె.సుధా, సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి లీలా సుభాష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.అర్చన, బార్ అసోసియేషన్ ట్రెజరర్ లతీఫ్ అహ్మద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి కపర్తి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం
- ఎంపిడిఒ గీతావాణి

ప్రజాశక్తి - ఆస్పరి

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఎంపిడిఒ గీతావాణి తెలిపారు. శుక్రవారం ప్రధానోపాధ్యాయులు విజయ కుమారి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలిసీ తెలియని వయస్సులో వివాహాలు చేసి అమ్మాయిల బంగారు భవిష్యత్తును నాశనం చేయవద్దని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులూ అమ్మాయిల చదువును ప్రోత్సహిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని చెప్పారు. బాల్య వివాహాల వల్ల అమ్మాయిల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిపోతుందని తెలిపారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ప్రసవ సమయంలో చాలామంది అమ్మాయిలు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో బాల్యవివాహాలు చేసినట్లు తెలిస్తే మహిళా సంఘాలకు, పోలీసులకు, తమ దృష్టికి తీసుకు రావాలని పేర్కొన్నారు. అంగన్వాడీ టీచర్లు రసులా బేగం, లత, రాధమ్మ, ఉపాధ్యాయులు బాబు, జయరామ్, విద్యార్థులు పాల్గొన్నారు. **నందవరం** మండల పరిషత్ ఆదర్శ పాఠశాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. బాల్యవివాహాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలను నిర్మూలించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ మాట్లాడారు. బాల్యవివాహాల నివారణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. **దేవనకొండ** కెజిబివి విద్యార్థినులు బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సునీత, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రధాన రహదారుల గుండా ర్యాలీ నిర్వహించారు.



దేవనకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



నందవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నూతన గృహం ప్రారంభం
ప్రజాశక్తి - మంత్రాలయం

మడ్డి వారి కుటుంబం నూతనంగా నిర్మించిన గృహాన్ని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రారంభించారు. శుక్రవారం స్థానిక రామచంద్ర నగర్ కాలనీలో సిఎస్ఐ చర్చి ముందు భాగంలో మడ్డి నరసప్ప కుమారుడు మడ్డి అబ్రహాం నిర్మించిన ఇంటిని రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేశారు. ఆయనతో పాటు వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, దశరథ రెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, జనార్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని అబ్రహాం సోదరులు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. అంతకుముందు నాయకులు కయ్యూన్, ప్రభుదాస్, రాజు, ఏబు, మారెప్ప, సల్మాన్, మారెప్ప, ఆనంద్, శాంతరాజు ఆధ్వర్యంలో పూల వర్షం కురిపిస్తూ.. బాణసంచా పేలుస్తూ ఘనంగా స్వాగతం పలికారు.



గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ఘనంగా మాతృభాష దినోత్సవం
ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని నేషనల్, జిఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో తెలుగు అధ్యాపకుల ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. నేషనల్ విద్యాసంస్థల అధినేత జి.గోపాల్ రెడ్డి, డైరెక్టర్ ఎస్.విజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు సత్యశ్రీ, ప్రైమరీ స్కూల్ ఇన్‌ఛార్జీ అనిల్ కుమార్ హాజరయ్యారు. భరతమాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు అధ్యాపకులు షేక్షావలీ మాట్లాడారు. తెలుగు భాష గొప్పతనం, తెలుగులో ఉన్న మాండలికాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యాసంస్థల అధినేత జి.గోపాల్ రెడ్డి మాట్లాడుతూ... మాతృభాష గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. తెలుగు అధ్యాపకులు లక్ష్మన్న, మల్లేశ్వరి, అనూష, అంజనా, స్వరాజ్, మీనా ఉన్నారు. అలాగే పట్టణంలోని కిల్చిన్ పేట పురపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో మాతృ భాష దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీల్ రాజ్ కుమార్ మాట్లాడారు. తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులు అనేక చార్టులు వేసి ప్రదర్శించారు. బాలచంద్రుడు, బ్రహ్మానంద రెడ్డి, చక్రపాణి, చంద్రకళ, జెరూష రత్న కుమారి, ఆనందమ్మ, ఇందు పాల్గొన్నారు. **కౌతాళం**లోని ప్రతిభ ఉన్నత పాఠశాలలో మాతృభాష దినోత్సవం నిర్వహించారు. కెనరా బ్యాంకు మేనేజర్ సద్దాం అలీ ముఖ్య అతిథిగా పాల్గొని, ముందుగా తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించా రు. ఈ సందర్భంగా సద్దాం అలీ మాట్లాడారు. మాతృభాష తల్లి లాంటిదని, మాతృభాషను ఎప్పుడూ చులకనగా చూడరాదని సూచించారు. అనంతరం విద్యార్థినులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాల గురించి పాటల రూపంలో నృత్యం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. తర్వాత మాతృభాష గొప్పతనం గురించి వ్యాసాలు, తెలుగు కవితల గురించి, చక్కగా రాసిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. తెలుగు ఉపాధ్యాయులు శిరీష, కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా, పాఠశాల సెక్రటరీ మైనుద్దీన్, ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, పర్యవేక్షకులు జయలక్ష్మి, భీమేష్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు. **హాలహర్వి** మండలంలోని నిట్రవట్టి గ్రామంలో 'ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ' సీజనల్ హాస్టల్‌లోఉపాధ్యాయులు కె.అయ్యనగౌడ్, కేర్ టేకర్ భంగి లక్ష్మన్న ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆదోనిలో మాట్లాడుతున్న గోపాల్ రెడ్డి



కౌతాళంలో జ్ఞాపికలు అందజేస్తున్న సిబ్బంది

ఇంటర్వ్యూకు 162 మంది హాజరు : ఎంపిడిఒ
ప్రజాశక్తి - ఆస్పరి



ఆస్పరిలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఎంపిడిఒ గీతావాణి



ఆలూరులో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఎంపిడిఒ

బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూ నిర్వహించినట్లు ఎంపిడిఒ గీతావాణి తెలిపారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులకు సంబంధించిన లబ్ధిదారుల కు ఇంటర్వ్యూ నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలోని 21 పంచాయతీల నుంచి 456 మంది బీసీ కార్పొరేషన్ రుణం కోసం దరఖాస్తు చేసుకోగా 4 దరఖాస్తులను వివిధ కారణాల వల్ల తిరస్కరించినట్లు తెలిపారు. 162 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారన్నారు. కైరుప్పల ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు సంబంధించి కైరుప్పల, కారుమంచి, ములుగుందం, డి.కోటకొండ, యాటకల్లు, తొగలగల్లు, బిలేకల్లు, అట్టేకల్లు గ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తుదారులకు మేనేజర్ల ఆధ్వర్యంలో ఈనెల 24న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని జిరాక్స్ కాపీలు ఇవ్వని లబ్ధిదారులు ఉంటే ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. **ఆలూరు** మండల పరిషత్ కార్యాలయంలో ఆలూరు, మొలగవల్లి ఎస్‌బిఐ ఆలూరు, ఆస్పరి ఎపిజిబి, ఆలూరు యుబిఐ బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఎంపిడిఒ సయ్యద్ మహబూబ్ బాష మాట్లాడుతూ... రుణాల కోసం 691 మంది దరఖాస్తూ చేసుకోగా 370 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారన్నారు. ఎంపికైన అభ్యర్థులను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

బాధితునికి ఆర్థిక సాయం
ప్రజాశక్తి - నందవరం



సాయం అందజేస్తున్న జీసస్ టెంపుల్ మినిస్ట్రీస్ ట్రస్ట్

బాధితునికి ఆర్థిక సహాయం అందజేశారు. నందవరం గ్రామానికి చెందిన ఎస్.నాగరాజు, బుడ్డమ్మ దంపతుల కుమారుడు ఎస్.సురేష్ రెండు నెలల క్రితం పూలచింత గ్రామానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో కుడిచేతిని కోల్పోయారు. తన ఎడమ చేయి, కుడికాలు విరిగి క్షతగాత్రులయ్యారు. రెండు నెలల పాటు హైదరాబాద్, అనంతరం, కర్నూలు సహస్ర హాస్పిటల్‌లో చికిత్స పొంది స్వగ్రామానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మిగనూరు జీసస్ టెంపుల్ మినిస్ట్రీస్ ట్రస్ట్ అధినేత డాక్టర్ గుమ్మలొల్ల సొలోమోను సురేష్‌ను, వారి తల్లిదండ్రులను శుక్రవారం పరామర్శించి రూ.28 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సురేష్ ఆరోగ్య స్థితి మెరుగుపడాలని ఆకాంక్షించారు. లిడియా, ఎం.ప్రకాష్‌లు సురేష్‌ను పరామర్శించారు.